



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహాబౌతిఖ్ ప్రముఖ్

ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా సమాజ పరివర్తన

- ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహాబౌతిఖ్ ప్రముఖ్ శివకుమార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 10: ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా సమాజ పరివర్తన, వ్యక్తి పరివర్తన లభిస్తుందని తెలంగాణ ప్రాంత సహాబౌతిఖ్ ప్రముఖ్ శివకుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని జీజీ కళాశాల మైదానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నగర శాఖ ఆధ్వర్యంలో జరిగిన శాఖ సంగమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివకుమార్ మాట్లాడుతూ.. మాతృభూమి వైభవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అందరిని ఈ గొప్ప కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. నగరంలోని 36బస్తీలకు చెందిన వేయి మంది స్వయం సేవకులు పాల్గొని ఒకే సారి 65కాషాయ ధ్వజారోహణం చేయడం చూపరులను ఆకట్టుకుంది. చిన్నారుల నుంచి వృద్ధులు సైతం ఈ శాఖలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. నగరంలో ప్రస్తుతం 50బస్తీలకు గాను 32బస్తీల్లో 36శాఖలు ఉన్నాయని రాబోయే ఏడాది 50బస్తీల్లో శాఖలను విస్తరిస్తామన్నారు. సమాజంలో మార్పుకు సంఘటితమే ఏకైక మార్గమని అన్నారు. ఇది భగవంతుని కార్యామని కలియుగాన సంఘటిత శక్తే ప్రభావ వంతమైన శక్తి అని అన్నారు. విద్యార్థి దశలో ఏబీవీపీ కార్మిక రంగంలో బీఎంఎస్ కర్షక రంగంలో బీకేఎస్ ఇలా 40కు పైగా వివిధ రంగాల్లో ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జాతీయ పునః నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంఘచాలక్ శ్రీనివాస్, జిల్లా కార్యవాహ వారేదస్తగిరి, నగర కార్యవాహ సత్యం, విభాగ కార్యవాహ దిగంబర్, తదితరులు పాల్గొన్నారు.



శారీరక కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



అమ్మవెంచర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాల భవనం



అనుమతులు లేకున్నా అడ్మిషన్లు!

- పాఠశాలకు అనుమతులు రాకుండానే.. వచ్చాయంటూ ప్రచారం
- ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటున్న యాజమాన్యం
- నిర్మాణ దశలోనే భవనాలు
- విద్యాశాఖాధికారులను తప్పుదోవ పట్టిస్తున్న యాజమాన్యాలు
- అనుమతుల కోసం దరఖాస్తు రాలేదంటున్న విద్యాశాఖ

నిజామాబాద్ అర్బన్, మార్చి 10: జిల్లాలో రాబోయే విద్యా సంవత్సరం కోసం కొన్ని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు దరఖాస్తులు చేసుకోకుండానే తమకు అనుమతులు వచ్చేసాయంటూ ప్రచారం చేసుకుంటూ అడ్మిషన్లను ప్రారంభించాయి.

నగరంలోని అమ్మవెంచర్‌లో ఏర్పాటు చేస్తున్న ఓ కార్పొరేట్ పాఠశాల ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో ఏకంగా నగరంలో పెద్ద పెద్ద హోర్డింగ్‌లను ఏర్పాటు చేసి అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రచారం చేసుకుంటుంది. కానీ ఈ పాఠశాలకు సంబంధించిన అనుమతి ఫైల్ ఇంకా విద్యాశాఖాధికారులకు చేరలేదు. 31 డిసెంబరు 2023 తేదీతో వచ్చే విద్యా సంవత్సరం అనుమతి కోసం అపరాధ రుసుముతో చలాన్ కట్టిన సదరు పాఠశాల ఆ తేదీనే ఫైల్‌ను ఎంఈవో ద్వారా జిల్లా విద్యాశాఖకు పంపించాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు మండల విద్యాశాఖకు గాని, జిల్లా విద్యాశాఖకు గాని ఫైల్ చేరకపోవడం విస్మయం కలిగిస్తుంది. విద్యాశాఖాధికారులు ఫైలును పరిశీలించి భవన నిర్మాణాన్ని కూడా పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉండగా పాఠశాల ఏర్పాటు చేస్తున్న స్థలంలో ప్రస్తుతం కేవలం ఒక అంతస్తు భవన నిర్మాణం మాత్రమే పూర్తయింది. మరో రెండు నెలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కావలసి ఉండగా మిగిలిన భవనం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఉంది. రాజకీయ పలుకుబడితో విద్యా సంవత్సరం ప్రారంభంలో పాత తేదీల్లో అధికారులు తనిఖీలు చేసినట్లు చూపి అనుమతులు పొందాలనే ఆలోచనలతో సదరు పాఠశాల నిర్వాహకులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ నగరంలోని సుభాష్‌నగర్‌లో లిబర్టీ పాఠశాలకు భవనం నిర్మాణం పూర్తి కాకుండానే విద్యాశాఖాధికారులు అనుమతులు ఇవ్వగా విద్యార్థి సంఘాల ఆందోళనతో ఆ పాఠశాలను అధికారులు సీజ్ చేశారు. అన్ని అనుమతులు ఉంటేనే పాఠశాలలు తమ అడ్మిషన్లను ప్రారంభించాల్సి ఉండగా ఇంకా విద్యాశాఖకు ఫైలే అందజేయని పాఠశాల తమకు అనుమతులు వచ్చేసాయంటూ అడ్మిషన్లు ప్రారంభించడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

కళాశాలలు అంతే..

నగరంలోని ముబారక్ ప్రాంతంలో కరీంనగర్‌కు చెందిన ఓ కార్పొరేట్ కళాశాల ఓ నిర్మాణంలో ఉన్న భవనాన్ని అద్దెకు తీసుకుని అందులో కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు నగరంలో పెద్ద పెద్ద హోర్డింగ్‌లను ఏర్పాటు చేసింది. సదరు కళాశాలకు చెందిన ఫైల్‌గాని అనుమతులకు చెందిన ఫైల్‌గాని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ దృష్టిలో లేదు. అయినప్పటికీ కార్పొరేట్ విద్యా సంస్థలు తమ పలుకుబడితో విద్యా సంవత్సరం ప్రారంభంలోపు అనుమతులు వస్తాయంటూ చెబుతూ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. వేలాది రూపాయలను ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను తమ మాయ మాటలతో బుట్టలోవేసుకుని తమ దందాను కొనసాగిస్తున్నారు.

ఫైలు మాకు రాలేదు..

: రామారావు, నిజామాబాద్ ఎంఈవో

నగరంలోని అమ్మవెంచర్‌లో ఏర్పాటు చేస్తున్న నిశిత ఇంటర్నేషనల్ పాఠశాలకు సంబంధించిన ఫైల్ ఇంక మా కార్యాలయానికి రాలేదు. 31డిసెంబర్ 2023లోపు అపరాద రుసుముతో చలాన్ కట్టిన పాఠశాలలకు మాత్రమే 2024-25విద్యా సంవత్సరానికి అనుమతి వస్తుంది. కాబట్టి నిశిత పాఠశాలకు సంబంధించిన ఫైల్ తమకు రానందున వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లు తీసుకునే అవకాశం ఆ పాఠశాలకు లేదు.

ఆ పాఠశాలకు అనుమతిలేదు..

:ఎన్‌వీ దుర్గాప్రసాద్, డీఈవో

నగరంలో నూతనంగా నిశిత ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు మాకు ఎలాంటి సమాచారం లేదు. పాఠశాల అనుమతులకు సంబంధించి ఎలాంటి ఫైల్ మా కార్యాలయానికి రాలేదు. రాబోయే విద్యా సంవత్సరానికి అనుమతులు పొందాలంటే ఇప్పటికే ఫైల్ మా కార్యాలయానికి రావాల్సి ఉండేది. కానీ ఫైల్ రానందున ఆ పాఠశాలకు వచ్చే ఏడాది అడ్మిషన్లు పొందే అవకాశం లేదు.



- ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో తేలిన పాత కుస్తపురం శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయ శిఖరం

తేలిన ఆలయ శిఖరం

- ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ముంపునకు గురైన పాత కుస్తపురం శ్రీరామ లింగేశ్వరస్వామి గుడి
- ప్రాజెక్టులో నీళ్లు తగ్గడంతో తేలిన శిఖరం
- పూజలు చేస్తున్న మత్స్యకారులు



డొంకేశ్వర్, మార్చి 10: ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ముంపునకు గురైన పాత కుస్తపురం శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయ శిఖరం బయటపడింది. ప్రాజెక్టులో నీళ్లు తగ్గడంతో గుడి శిఖరం తేలి దర్శనమిస్తోంది. డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామ పాతూర్ శివారులోని గుడి కొన్నేళ్లుగా నీటిలోనే ఉంది. అయితే ఈ ఆలయానికి చాలా ప్రాముఖ్యత ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. త్రేతాయుగంలో శ్రీరాముడు అరణ్యవాసం చేసేటప్పుడు గోదావరి తీరం వెంబడి ప్రయాణించి, ప్రశాంతత కలిగిన చోట నిద్రపోయే వారని చెబుతుంటారు. ఆయన శివభక్తుడు కావడంతో ప్రతీరోజు శివలింగాలకు పూజ చేసి ప్రయణిస్తుండేవారని, ఈ ప్రాంతంలో గంగా నది దక్షిణమునకు పారుతున్న ప్రాంతానికి చేరుకుని ఉదయం పూజ చేసే వారని గ్రామస్థులు చెబుతున్నారు. పూజ సమయంలో పక్కనే ఉన్న గుట్టలోంచి శివలింగాన్ని తీసుకురమ్మని హనుమంతుని రాముడు ఆదేశిస్తాడు. అయితే గుట్టపై అధిక సంఖ్యలో లింగాలు ఉండడంతో ఏ లింగం తీసుకురావాలో అర్థంకాక హనుమంతుడు గుట్టని తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాడు. లింగం తేవడం ఆలస్యం కావడంతో శ్రీరాముడు స్వయంగా ఇసుక లింగాన్ని తయారు చేసుకొని పూజిస్తాడు. సాక్ష్యాత్తు శ్రీరాముడు తయారు చేసిన లింగం కనుక ఈ లింగాన్ని సైకత లింగంగా పేరుంది. దీంతో శ్రీరామ లింగేశ్వర ఆలయంగా పిలుస్తారు. ప్రతీ 12ఏళ్లకు ఒక సారి మొత్తం నీళ్లు తగ్గిపోయి గుడి పూర్తిగా తేలుతోంది. గుడి తేలినప్పుడు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి శివలింగాన్ని దర్శించుకుని పూజలు చేస్తారని స్థానికులు తెలిపారు. రెండేళ్లుగా గుడి శిఖరం తేలుతుండడంతో డొంకేశ్వర్ మండల మత్స్యకారులు శిఖరం తేలడంతో శిఖరానికి రంగులు వేసి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించి చేపల వేటను కొనసాగిస్తున్నారు.

గుడిని దర్శించుకొని చేపల వేటకు వెళ్తారు..



: చిన్న గంగారాం, మత్స్యకారుడు, నడ్కుడ

పదేళ్లుగా గుడి శిఖరం తేలిన వెంటనే గుడికి వెళ్లి సున్నం వేసి కొబ్బరికాయ కొట్టి పూజ చేస్తాను. గుడిని దర్శించుకొని ప్రతీరోజు చేపల వేటకు వెళ్తారు. శివరాత్రి, ఉగాది, హనుమాన్ జయంతి సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చేపలు పట్టే చోట నుంచి మూడు కిలోమీటర్ల తెప్పపై ప్రయాణం చేసి శిఖరానికి కొబ్బరికాయ కొట్టి పూజ చేస్తాను.





'ఉపాధి' చెల్లింపులకు బ్రేక్!

- నాలుగు నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు
- ఆందోళనలో ఉపాధిహామీ కూలీలు
- ఆదుకోవాలని సర్కారుకు వేడుకోలు

బోధన్ రూరల్, మార్చి 10: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ సిబ్బందికి నాలుగు నెలలుగా డబ్బులు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పల్లెల్లో నివసించే ప్రజలు ఉపాధి దొరకక పట్టణాలకు వలస వెళ్లడాన్ని తగ్గించాలనే ఆలోచనతో 2005లో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అనేక రకాల పనుల ద్వారా కూలీలకు పనులు దొరకడమే కాకుండా పల్లెల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు అవుతున్నాయి. అయితే గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడానికి విశేషకృషి చేస్తున్న ఉద్యోగులు, కింది స్థాయి సిబ్బంది బతుకులు మాత్రం దుర్భరంగా మారుతున్నాయి. మార్చి నెలతో కలిపి ఇప్పటి వరకు నాలుగు నెలల జీతం అందక ఉపాధిహామీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి కిరాయి, పిల్లల చదువులకు ఫీజులతో పాటు నిత్యావసరాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు.

గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో అనేక రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రైతు వేదికల నిర్మాణం, కల్లాలు, ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, కంపోస్ట్‌లు, ఇంకుడు గుంతలు, మరుగు దొడ్లు, హరితహారం, అవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్లు, సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, మురుగు కాల్వలు, చెరువుల పూడికతీత, గ్రామీణ క్రీడా ప్రాంగణాల నిర్మాణం ఇలా అనేక రకాల సుమారు 50కి పైగా పనులు ఈ పథకంలో కొనసాగుతున్నాయి.

పనిభారం అధికం..

ప్రతీ పనిలో క్రిందిస్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు శ్రమించాల్సిందే. ప్రతీపనికి ముందస్తు ప్రణాళికలు, లక్ష్యాలు తయారు చేయడం, వాటిని అమలు చేయడం, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం వంటివి పూర్తయితేనే కూలీలకు సరైన సమయంలో డబ్బులు అందుతాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాకూడా కొత్త సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే పనిభారం అధికమవుతుంది. నిజామాబాద్ జిల్లాలో సహాయ ప్రాజెక్టు అధికారులు 22. ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 11, కంప్యూటర్ ఆపరేటర్లు 45, సాంకేతిక సహాయకులు 69, క్షేత్ర సహాయకులు 320 మంది విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్ర సహాయకులు ప్రతి గ్రామానికి ఒక్కరు అవసరం ఉన్నా ఒక్కొక్కరు 2, 3 గ్రామాలు చూసుకుంటున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతి మండలానికి ఇద్దరు ఉండాల్సి ఉండగా 27 మండలాలకు గాను 45 మంది మాత్రమే ఉన్నారు. ఇంత కష్టపడుతున్నా.. నాలుగు నెలల నుంచి జీతాలు అందక వారు అప్పుల పాలవుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వేతన బకాయిలు క్లియర్ చేసి ఏ నెల జీతం ఆ నెల అందేలా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేతనాలు ఎప్పటికప్పుడు చెల్లించాలి..


: బి.మల్లేష్, జిల్లా అధ్యక్షుడు, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్

జిల్లాలో నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశాక ఇప్పటి వరకు ఆ గ్రామాల్లో ఉపాధిహామీ సిబ్బందిని నియమించలేదు. అంతే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ మాకు అవేమి కల్పించకపోగా మార్చి వరకు 4 నెలల జీతం రావాల్సి ఉంది. విపరీతమైన పనిభారంతో సతమతమవుతున్న మాకు జీతాలు కూడా సమయానికి అందకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. కనీస అవసరాలకు కూడా అప్పులు చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా మా వేతన బకాయిలు చెల్లించి పే స్కేల్ వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.





గాలింపు చర్యలను పరిశీలిస్తున్న పోలీసులు



మృతదేహాలు లభ్యం

- మూడు కుటుంబాల్లో విషాదఛాయలు

వర్ని, మార్చి 10: వర్ని, చందూర్ మండలాల పరిధిలో శనివారం నిజాం సాగర్ ప్రధాన కాలువలో ముగ్గురు గల్లంతు కాగా గల్లంతయిన ముగ్గురి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. చందూర్ శివారులో మోచి విజయ్(50)మృతదేహం లభ్యం కాగా మరో యువకుడు మొండి విష్ణువర్ధన్(20)మృత దేహం గల్లంతు అయిన ప్రదేశంలోనే లభ్యమయింది. మరో యువకుడు మోచి నారాయణ(25)మృతదేహం విక్టరీ స్కూల్ సమీపంలోని డీ38/ఏ కాలువలో లభ్యమైంది. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ జయేష్, ఎస్ఐ కృష్ణ కుమార్, పోలీసు సిబ్బంది గజ ఈతగాళ్ల ఉదయం నుంచి ప్రధాన కాలువలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాల లభ్యంతో మృతుల కుటుంబల సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



విష్ణువర్ధన్ మృతదేహం



విజయ్ మృతదేహం



మోచి నారాయణ మృతదేహం

తాహెర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వర్ని, మార్చి 10: రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్‌ను ఆదివారం వర్నిమండల కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాహెర్ బిన్ హందాన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తాహెర్‌బిన్‌హందాన్ అందించిన సేవలను గుర్తించి పార్టీ అధిష్ఠానం గౌరవ పదవిని అప్పజెప్పిందని పీసీసీ డెలిగేట్ డాక్టర్ రాజిరెడ్డి పేర్కొన్నారు.

'పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోటగిరి, మార్చి 10: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన 'గ్రామాల్లో పాలన అస్తవ్యస్తం' అనే కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. డంపింగ్ యార్డు, మురికి కాలువలు, రక్షిత మంచినీటి పథకంలో పేరుకుపోయిన నాచును తొలగించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టారు. బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా జల్లాపల్లి గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. సాగునీటి కాలువ పక్కన మురికి నీరు నిలిచిన ప్రాంతాన్ని మొరంతో చదును చేయించారు.


జల్లాపల్లిలో మురికి కాలువను శుభ్రం చేయిస్తున్న డీఎల్‌పీవో

కొడిచర్ల గ్రామంలో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. కారేగాం మంచినీటి పథకంలో పేరుకుపోయిన నాచును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో సాయిబాబా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై కార్యదర్శులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాలలో కార్యదర్శులు నిత్యం పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. విధి నిర్వహణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత కార్యదర్శులపై శాఖ పరమైన చర్యలు తప్పవని డీఎల్‌పీవో హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో మారుతీ, పంచాయతీ కార్యదర్శులు అనిత, దీపిక పాల్గొన్నారు.

ధ్వంసమైన వర్సిటీల పునర్నిర్మాణం చేపట్టాలి

- వైస్ చాన్స్‌లర్‌లను తక్షణమే నియమించాలి : ప్రొ.పున్నయ్య

డిచ్‌పల్లి, మార్చి10: రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, వర్సిటీల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాలని, ధ్వంసమైన వర్సిటీల పునర్నిర్మాణం చేపట్టాలని తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ పున్నయ్య అన్నారు. ఆదివారం తెలంగాణ వర్సిటీలో ఉన్నత విద్యారంగంలో సవాళ్లు, వర్తమాన రాజకీయాలు అనే అంశంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కన్వెన్షన్ రెండోరోజు ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీల అభివృద్ధికి రూ.5వేల కోట్ల



సదస్సులో మాట్లాడుతున్న ప్రొ.పున్నయ్య

నిధులను కేటాయించాలని, ప్రతీ పరిశోధక విద్యార్థికి ఫెలోషిప్ అందించాలని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ వర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈకన్వెన్షన్‌లో 26మందితో కమిటీని ఎన్నుకున్నారు. యూనివర్సిటీల కన్వీనర్‌గా మమత (ఓయూ) ఎన్నిక కాగా, కోకన్వీనర్‌గా ప్రసాద్, ఆంజనేయులు, పవిత్ర ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా.సూరి ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి రమేశ్‌బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, జిల్లా కార్యదర్శి అనిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు భరత్, రవి, సంధ్య, ప్రసాద్, దీపిక, మహేశ్, నాగరాజు, సాయికుమార్, దినేశ్, చిత్రు, పవన్ పాల్గొన్నారు.

రేపు డిచ్‌పల్లి రైల్వే గూడ్స్ షెడ్డు ప్రారంభం

● వర్చువల్ వేదికగా ప్రారంభించనున్న ప్రధాని మోదీ



వర్చువల్ వేదికగా డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ప్రధాని ప్రారంభించనున్న గూడ్స్ రైల్వే షెడ్డు

డిచ్‌పల్లి, మార్చి 10: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన గూడ్స్ రైల్వే షెడ్డును 12న ఉదయం 8గంటలకు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ వేదికగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నట్లు ప్రోగ్రాం ఇన్‌చార్జి రవీందర్ తెలిపారు. ఇందులో భాగంగా గూడ్స్‌షెడ్డుతో పాటు ప్లాట్ ఫాం, హమాల గది ని ప్రారంభిస్తారని ఈ కార్య క్రమానికి పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డిలు హాజరుకానున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావలని ఆయన కోరారు.

తగిలేపల్లిలో ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపనలు

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ రాక

వర్ని,మార్చి10: వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో సోమవారం అపురూప ఘట్టం ఆవిష్కృతం ఆరంభం కానుంది. సుమారు రూ.80లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీ పెద్దమ్మ, గజ్జెలమ్మ, బొరడి పోచమ్మ, ఊరడమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంను చేపట్టనున్నారు. కార్యక్రమానిన్ని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుజ్జ శంకర్, బక్క రాములు తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15లక్షలు మంజూరు కాగా ముదిరాజ్ సంఘం వారు రూ.18లక్షలు సమకూర్చినట్లు తెలిపారు. మరో రూ.12లక్షలు అప్పు చేయగా పూర్తి వ్యయంను గ్రామ ప్రజలు, గ్రామ కమిటీ, దాతల రూపంలో సేకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా

పెద్దబాజార్,మార్చి 10 :పీఎఫ్ కార్యాయలయం ఎదుట సోమవారం ఉదయం 10గంటలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు కనీన పెన్షన్ ఆరువేల రూపాయలను పెంచాలన్నారు. ఆన్‌లైన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నామినేషన్ పెంచన్ అమలు చేయాలని ఆర్‌వోసి సమస్యను పరిష్కరించాలని అన్నారు.ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి భానుచందర్, నాయకులు సాయమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

నడిమితండాలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

మెండోర, మార్చి10: ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు మండలంలో నడిమితండాలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా 14నుంచి అనిల్‌నాయక్ స్మారక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయని టోర్నీలో పాల్గొనే జట్లకు భోజన వసతి ఏర్పాటు చేయనున్నామని వివరాలకు 7558530299 నెంబర్‌లో సంప్ర దిం చాలని నిర్వాహకులు కోరారు.

నాగాపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు

కమ్మర్‌పల్లి, మార్చి 10: మండలంలోని నాగాపూర్ గ్రామానికి మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆదివారం టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, డీసీసీ అధికార ప్రతినిధి ఏలేటి గంగాధర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. జాతీయ ఉపాధిహామీ పథకంద్వార మంజూరైన ఐదులక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రవీన్ , మండల కాంగ్రెస్ నాయకులు వేముల గంగారెడ్డి, బుచ్చిమల్లయ్య, తెడ్డురమేష్ ,రేవతి గంగాధర్, నల్లగణేస్ గుప్త, అవారి సత్యం, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండలం కేంద్రంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆది వారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీకా ంత్‌తో కలిసి పనులు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.15 లక్ష లు మంజూరు కాగా గ్రామంలో సీసీరోడ్డు పనులు వారు ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు గోక గంగా రెడ్డి, వీడీసీసభ్యులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

నందిపేట, మార్చి10: మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణంకు ఆదివారం భారతీయ జనతా పార్టీ నాయకులు భూమి పూజ చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ ఐటీ అండ్ సోషల్ మీడియా కన్వీనర్ మంగ్లారపు నవీన్, బూత్ అధ్యక్షుడు మంగ్లారపు సాయన్న, మండల కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు నత్తి నాగభూ షణం, నాయకులు మంగ్లారం మర్రిపల్లి రాజు, రాంరాజు, నంగి చిరంజీవి, పల్లె మారుతి, ఉద్దిరి కౌశిక్, తధితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో నమస్తేతెలంగాణ పత్రిక ప్రతుల దహనం

కమ్మర్‌పల్లి, మార్చి 10: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు బేగంపేట్ విమానశ్రయంలో రెండు రోజులక్రితం రహస్యంగా భేటీ అయ్యారని రాజకీయంగా రహస్య చర్చలు జరిపారని నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన అసత్యపు వార్త ను ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు నమస్తే తెలంగాణ పత్రిక ప్రతులు దహనం చేసిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. ఇద్దరు కలిసినట్లు కల్పితవార్తలు రాస్తూ తెలంగాణ సీఎం కు, కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరుతెచ్చేవిధంగా అఆఅఅసత్య వార్తలు వ్రాయడం సరయినది కాదన్నారు. అధికారం చేజారినతర్వత మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ లకు మింగుడుపడక పత్రికను అడ్డం పెట్టుకుని షైడ్‌గేమ్‌లకు తెరలేపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి ఏలే టి గంగాధర్, కాంగ్రెస్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్, తదితులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో దొంగల హల్‌చల్

● ఒకే రోజు నాలుగు ఇళ్లలో దొంగతనం ● 15 తులాల బంగారం,40 వేల నగదు చోరీ
● బడాభీమ్‌గల్ గ్రామంలో ప్రధాన కూడలి వద్ద ఇంట్లో దొంగల హల్‌చల్

భీమ్‌గల్ రూరల్, మార్చి10: భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. బడాభీమ్‌గల్ గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న జంగం రాజేశ్వర్, జంగం రాజేశ్వరి ఇళ్లలో దొంగతనానికి పాల్పడ్డారు.శనివారం అర్ధరాత్రి సమయంలో జంగం రాజేశ్వర్ ఇంటి వెనుక ద్వారం గుండా నలుగురు దొంగలు లోపలికి చొరబడ్డ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. జంగం రాజేశ్వర్ బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లిన సమయంలో దొంగతనం జరిగింది. ఆదివారం ఉదయం జంగం ప్రభు ఇంటి గేటును తీసేక్రమంలో గేటు తాళం, ఇంటి తాళాలు పగలగొట్టి వున్నాయి. వెంటనే ఇంటి లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. జంగం రాజేశ్వర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి భీమ్‌గల్ ఎస్సై హరిబాబు చేరుకొని దొంగతనం జరిగిన తీరును, ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాలో మొత్తం నలుగురు దొంగలు ముఖాలకు గుడ్డలు కట్టుకుని ఇంట్లోకి చొరబడి నట్టు గుర్తించారు. ఇంట్లో ఉన్న పెంపుడు కుక్కను రాడ్డుతో తలపై బలంగా కొట్టడంతో స్పృహతప్పి పడిపోయింది. జంగం రాజేశ్వర్ ఇంట్లో 7 తులాల బంగారు ఆభరణాలు , నగదు, జంగం రాజేశ్వరి ఇంట్లో 8 తులాల బంగారు ఆభరణాలు, 40 వేల నగదు చోరీకి గురైనట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. మిగతా రెండిళ్లలో తాళాలు పగలకొట్టారు. దొంగతనం జరగలేదని తెలిపారు. క్లూస్ టీం బృందం ఆధారాలు సేకరించారు. ధరఖాస్తు దారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.



బడాభీమ్‌గల్‌లో దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎస్సై

ఆలూర్‌లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



ఆలూర్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి10: ఆలూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25లక్షల నిధులతో చేపట్ట నున్న అభివృద్ధి పనులకు ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ భూమిపూజ చేశారు. రూ.10లక్షలతో కళ్యాణ మండపం, ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ నిర్మాణాలకు రూ.10లక్షలు, రూ.5లక్షలతో శివలింగయ్య గుడివద్ద షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి డేగ పోశెట్టి, కల్లెం మల్లారెడ్డి, నవనీత్, సంజీవ్, బాస్కర్, నారాయణ, ముత్యం, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

● ఆలూర్‌లో ప్రొటోకాల్ వివాదం

ఆలూర్ మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేయడం పట్ల బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా అభివృద్ధి పనులకు ఎలా శంకు స్థాపన చేస్తారని మండల బీజేపీ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్ అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం చూస్తే తాము సహ కరిస్తామని,లేనిపక్షంలో ఇలాంటి చర్యలను తాము సహించేదిలేదన్నారు. ఇలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నాయ కులు సైతం బీజేపీపై మండిప డ్డారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి గెలిచినప్పటి నుంచి నియోజకవర్గ అభివృద్ధిపై కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మీద, నాయకుల మీద కక్ష్యసాధించాలని చూస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో విమర్శిం చారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, వినోద్, నవనీత్, మహేష్‌లు అన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎంపీ కపటప్రేమ

● కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

నిజామాబాద్‌అర్బన్,మార్చి 10 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్దిపొందాలనే ఉద్యేశ్యంతో ఎంపి అర్వింద్ బంజారాలపై కపట ప్రేమను చూపిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కెతావత్‌యాదగిరి విమర్శించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ఆదివారి కార్పోరేషన్, గిరిజన కార్పోరేషన్, ఎరుకల కార్పోరేషన్ ఏర్పాటు చేస్తుందని, అసైన్డ్,పోడు భూములకు పట్టాలు కూడా ఇస్తుందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గిరిజనులు కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉంటారనే భయంతో ఎంపి అర్వింద్ రామరావ్‌మహారాజ్ విగ్రహాలను పంపిణి చేశారని ఆయన విమర్శించారు. నిజంగా అర్వింద్‌కు గిరిజనులపై ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతి తాండలో రామారాజ్‌మహారాజ్ దేవాలయాలను కట్టించాలన్నారు. 2019ఎన్నికలకు ముందు బంజారాల గురువైన రామరావ్ మహారాజ్ ఆశీస్సులు తీసుకుని ఎన్నికల్లో గెలిచారని గత ఐదేళ్లలో గిరిజనుల కోసం చేసింది ఏమిలేదన్నారు. బీజేపీ గిరిజనుల అభివృద్ధికి చేసిందేమిలేదని, ఎంపీ అర్వింద్ తాండాల్లో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ బంజారాల పట్ల నిర్లక్ష్యం వహించినందునే బంజారాలు బుద్ది చెప్పారని, రాబోయే ఎన్నికల్లో అర్వింద్‌కు అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈవిలేకరుల సమావేశంలో కిసాన్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పాగంగారెడ్డి, గిరిజన నాయకులు తారాచంద్‌నాయక్, ప్రకాష్‌నాయక్, రవినాయక్, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

సావిత్రి బాయి పూలే దేశానికే ఆదర్శం

నిజామాబాద్‌అర్బన్,మార్చి 10: సంఘసంస్కర్త, సామాజిక కార్యకర్త సావిత్రిబాయిపూలే దేశానికే ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆదివారం సావిత్రిబాయిపూలే 127వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో సీపీఐ కార్యలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ దేశం లో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా, సంఘసంస్కర్తగా బడుగు,బలహీన వర్గాల కోసం ఆమె కృషి చేశారన్నారు. మహిళల చదువును గుర్తించిన మొట్టమొదటి వ్యక్తి ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐ టీ యూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అంజలి,రఘురాం, నాయకులు పవన్‌కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో ..

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ సమస్యలపై సావిత్రిబాయి పూలే స్పూర్తితో పోరాటం చేయాలని వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు అక్షయ్, రవీందర్‌లు విద్యార్థులకు పిలుపునిచ్చారు. 127వ సావిత్రి బాయి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడు తూ- పూలే దేశంలో మొదటి సారి అట్టడుగు స్థాయి వారికి విద్య బోధన లు నేర్పించారని వితంతువు వివాహాలకు వ్యతిరేకంగా పోరాడరని సావిత్రి బాయి పూలే స్పూర్తితో పోరాటం సాగించలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ నాయకులు హన్మండ్లు, నవ్య, బిందు, అశ్విన్, సాయిపవన్ పాల్గొన్నారు.



టీయూలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

మోర్తాడ్: మండల కేంద్రంలో మండల దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రిబాయి 120వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరి రాజారాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజారాం, బాబురావు, మామిడి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు నడిపల్లి తైబజార్ వేలం

డిచ్‌పల్లి,మార్చి 10: మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నేడు ఉదయం పదిన్నర గంటలకు తైబజార్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి నిట్టు కిషన్‌రావు ఆదివారం తెలిపారు. తైబజారు వేలంలో పాల్గొనే వారు రూ.50వేల ముందుగా చెల్లించాలని డిపాజిట్ చెల్లించిన వారికి మాత్రమే వేలం పాటలో పాల్గొనవచ్చుఅన్నారు.

రేపు తైబజార్ వేలం

ధర్పల్లి మార్చి10: ధర్పల్లి గ్రామపంచాయతీ తైబజార్ వేలం పాట మంగళవారం నిర్వహించనున్నట్లు ఈవో సైఫోద్దిన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో గల రోజువారి తమ వారంతపు సంతకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు ధర్పల్లి పంచాయతీ ఆవరణలో నిర్వహించే ఈ వేలం పాటకు ఆసక్తి గల వారు పాల్గొనాలని సూచించారు. ఈ వేలం పాట ఏడాది పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలి

పెద్దబాజార్,మార్చి 10:మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ప్రభుత్వ హాయంలో మధ్యాహ్నభోజన కార్మికులకు సుమారు రూ. 10కోట్ల బిల్లులను గత అక్టోబరు నుంచి చెల్లించడం లేదని అన్నారు. మార్చి నుంచి కోడిగుడ్ల బిల్లులను సైతం ఇవ్వడం లేదన్నారు. 9,10తరగతి విద్యార్థులకు చెందిన బిల్లులతో పాటు మధ్యాహ్నబోజన కార్మికులు వేతనం రూ.2వేల, 1నుంచి 8వ తరగతి విద్యార్థుల బిల్లులు వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాకార్యదర్శి ఓమయ్య,నాయకులు పోసాని, శకుంతల, నరేష్, పద్మ, సుహాసిని, వివిధ మండలాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు వారసంత, మేకల సంత వేలంపాట

నవీపేట,మార్చి10: నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంత, శనివారం జరిగే మేకల సంతకు సంబంధించి ఈ నెల 12న మంగళవారం రోజున వేలంపాట నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగే వేలంపాటలో ఆసక్తి గల వారు వారంతపు సంత వేలంకు రూ.లక్ష , మేకల సంత వేలంపాటకు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని ఆయన కోరారు.

క్రీడలతో మంచి భవిష్యత్

● నాలుగు మండలాల క్రికెట్ టోర్నమెంటను ప్రారంభించిన సీఐ

ధర్పల్లి మార్చి10: యువతకు క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని ధర్పల్లి సీఐ బిక్షపతి అన్నారు. ఆదివారం మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలోని యువకులు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు ధర్పల్లితో పాటు ఇందల్వాయి, సిరికొండ, భీమ్‌గల్ మండలాలకు చెందిన 40జట్లు పోటీ పడనున్నాయి. ఈ సందర్భంగా యువకులనుద్దేశించి సీఐ మాట్లాడుతూ యువకులు క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. ఓటమి గెలుపు తొలిమెట్టుగా బావించి గెలిపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. చెడు వ్యాసనాలకు బానిసలు కాకుండా ఉండాలని పేర్కొన్నారు.వీరి వెంట ఎస్సై వంశీకృష్ణరెడ్డి, గ్రామస్థులు ఉన్నారు

నవీపేటలో లారీ, కారు ఢీ

నవీపేట,మార్చి10: మండల కేంద్రంలోని శివాజీ చౌక్ సమీపంలో ఆదివారం సాయంత్రం లారీ, కారు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన ప్రకారం నవీపేట నుడి నిజామాబాద్ వైపు కారు వెళ్తుండగా నిజామాబాద్ నుండి నవీపేట వైపు లారీ వస్తుందని, లారీ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి కొద్ది దూరం కారును లాకెళ్లిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని వారు వివరించారు. ఈ ప్రమాదంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

డివైడర్‌ను ఢీకొన్న కార్లు

బోధన్‌రూరల్, మార్చి 10: ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫాం వద్ద ఆదివారం ఉదయం ఒక కారు డివైడరును ఢీకొని మరో కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. బోధన్ పాన్‌గల్లీకి చెంఇన అబ్దుల్ సలాం తన కుటుంబ సభ్యులతో కలిసి మారుతి స్విఫ్ట్ కారులో హైదరాబాదువెళ్లి బోధన్ తిరిగి వస్తుండగా ఎమ్మెస్సీఫాం గ్రామం దాటగానే బోధన్‌వైపు నుంచి వస్తున్న మారుతీ డిజైర్ కారు డివైడర్‌ను ఢీ కొట్టి ఎగిరి అబ్దుల్ సలాం యొక్క కారుపై పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు నుదుటిపై, కుడి చేతి పై మరో కారు నడిపిన వ్యక్తి నీలేష్ అగర్వాల్‌లకు గాయాలయ్యాయి, అబ్దుల్ సలాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

వేల్పూర్‌లో రేషన్‌బియ్యం పట్టివేత

ఆర్మూర్‌రూరల్, మార్చి10:మండలంలోని వజ్రా రైస్‌మిల్లులో శనివారం అర్ధరాత్రి సుమారు 120టన్నుల రేషన్ బియ్యంను అధికారులు పట్టుకున్నారు. వేల్పూర్ ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా సీపీ కాల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ విష్ణుమూర్తి స్థానిక పోలీసులు దాడి చేసి వజ్ర రైస్‌మిల్లులో అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యంను పట్టుకున్నామన్నారు. రైస్‌మిల్‌పై దాడి చేసే సమయంలో రేషన్‌బియ్యం లోడ్‌తో రెండు పెద్ద లారీలు ఉండగా వీరితో పాటు మరో రెండు లారీల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. ఆదివారం ఉదయం సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి రైస్‌మిల్లుకు వచ్చి రేషన్ బియ్యం పరిశీలించి అంచన వేయగా పట్టుకున్న బియ్యం సుమారు 120టన్నులు ఉంటుందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంను మాక్లూర్‌లోని రైస్‌మిల్‌కు తరలించి అక్కడ తూకం వేయించి మొత్తం ఎన్నిక టన్నుల బియ్యం వచ్చిందో విచారిస్తామన్నారు. రైస్‌మిల్ యాజమాని సాయికృష్ణగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఆర్‌ఐలు ఉన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు'

సుభాష్‌నగర్,మార్చి 10 :మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలంగాణా మున్నూరుకాపు, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలశ్రీనివాస్ అన్నారు. మేడ్చల్‌లో మహిళ దినోత్సవం సందర్భంగా 33 జిల్లాల నుంచి వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు తెలంగాణా మున్నూరుకాపు, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా నుంచి అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి ఇండియన్ విమెన్ కోచ్ యెండెల సౌందర్య, రేలారే ఫేమ్ గంగా, ఎన్.విజయలక్ష్మి, జాతీయ ఉపాధ్యాయ అవార్డ్‌గ్రహీత సుమలత, ప్రొఫెసర్ స్వర్ణలత, భాగ్యలక్ష్మి, నగ్మా, స్వరూపపటేల్‌లను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో తోటరాజశేఖర్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

చెరువులోపడి యువకుడి మృతి

బోధన్ రూరల్, మార్చి 10: ఎడపల్లి మండల కేంద్రంలోని పులి చెరువులోపడి యువకుడు మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై విక్రమ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి గ్రామానికి చెందిన కంటెడి రాహుల్(25) అనే యువకుడు 8వతేదీన రాత్రివేళ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆదివారం రోజున పులి చెరువులో పడి మరణించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నారం వాసి అదృశ్యం

డొంకేశ్వర్, మార్చి10: తీర్థయాత్రలకు వెళ్ళి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళిన గంగారాం నెల రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు రాలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మొకద్దం గంగారాం గత కొద్ది రోజులుగా కనిపించకుండా పోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎవరికైనా ఆచూకి తెలిసేత నందిపేట పోలీసులకు సమాచారం అందించాలని కుటుంబసభ్యులు కోరారు.

నేటి నుంచి కొలనుపాకకు మహా పాదయాత్ర

కోటగిరి,మార్చి10: పొతంగల్ మండలంలోని సుంకిని గ్రామం నుంచి సద్గురు మహదేవ్ స్వామి ఆధ్వర్యంలో మహ పాదయాత్ర సోమవారం నుండి నిర్వహిస్తున్నట్లు సుంకిని మహరాజ్ సంతోష్ సిద్ధి లింగాప్ప తెలిపారు. యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో ఆది జగద్గురు రేణుకా చార్యులు పుణ్యక్షేత్రాన్ని కాలి నడకన వెళ్లి దర్శించుకుంటారని ఆయన తెలిపారు.ఆలయంలో పొతంగల్ విండో డైరెక్టర్ విజయ్‌పటేల్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ మఠం పీఠాధిపతి మహదేవ్ మహరాజ్, డీసీసీబీ డైరెక్టర్ పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 270



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.65,800	రూ.60,700	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : శైతాన్ (హిందీ)(10.20,1.20,4.20,7.20,10.20)
స్క్రీన్-2 :గామి(10.00, 1.10, 4.20, 7.35, 10.45)
స్క్రీన్-3 : భీమా (12.20,6.55) : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.25) :ఆపరేషన్ వాలెంటైన్ (10.00)
స్క్రీన్-4 : బాబు (1.30) : రికార్డుబ్రేక్ (4.15) :మంజుమెల్‌బాయ్స్ (మళయాలం) (7.15) ప్రేమలు (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : భీమా (10.50,1.40,4.30,7.30,10.30)
స్క్రీన్-2 ప్రేమలు (1.30,7.30) :ఆపరేషన్ వాలెంటైన్ (4.30,10.30)
స్క్రీన్-3 :గామి(10.30, 1.30, 4.30, 7.30, 10.30)

దేవి ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : భీమా (11.15, 2.15, 6.15 9.15,)
నటరాజ్ : శైతాన్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : గామి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్